ఎక్కడి సమస్యలు అక్కడే..

- సీనియర్ డాక్టర్ల డుమ్మా
- లిఫ్ట్‌లకు తరచూ మరమ్మతులే..
- వేధిస్తున్న మందులు, పరికరాల కొరత
- రోగులకు చుక్కలు చూపిస్తున్న పెద్దాస్పత్రి
- నేడు హెచ్‌డీఎస్ కమిటీ సమావేశానికి కలెక్టర్ రాక

నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రి(సర్వజన ఆస్పత్రి)లో సూపర్ స్పెషాలిటీ డాక్టర్లున్నారు. అరుదైన శస్త్ర చికిత్సలను సైతం చేస్తున్నారు. రోగులకు ఎంతో మంచి జరుగుతోంది. నాణేనికి ఇది ఒక వైపు మాత్రమే.. మరోవైపు ఇక్కడ అన్నీ సమస్యలే.. చిన్న, చిన్న సమస్యలను కూడా పరిష్కరించకపోవడంతో రోగులు నరక యాతన పడుతున్నారు. ఈ నేపథ్యంలో పెద్దాస్పత్రిలో మంగళవారం కలెక్టర్ ఆనంద్ అధ్యక్షతన హాస్పిటల్ అభివృద్ధి కమిటీ(హెచ్‌డీఎస్) రెండో సమావేశం జరుగనుంది. ఇందులో రోగులకు నాణ్యమైన వైద్యసేవలందించే విధంగా ప్రణాళికను సిద్ధం చేస్తారో.. లేదో చూడాలి.



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

నెల్లూరు(అర్బన్) : నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో 750 పడకలున్నాయి. ఇక్కడ అన్నిరకాల స్పెషాలిటీ సేవలున్నాయి. అయితే అన్ని విభాగాల్లో సమస్యలు పేరుకుపోయి ఉన్నాయి. ఇక్కడ బీపీ ఆపరేటర్ల కొరత ఉంది. ఫిజియోథెరపీ విభాగంలో కనీస పరికరాలు లేవు. పక్షవాతం రోగులు, నరాలు పట్టేసిన వారు, డయాబెటిస్ వల్ల చేతి భుజం పట్టేసిన వారు, కొన్ని రకాల నొప్పులకు తగ్గించేందుకు ఫిజియోథెరపీ తప్పనిసరి. అయితే ఇక్కడ ఒక్క పరికరం లేదు. కేవలం రూ.నాలుగైదు వేల వంతున ఖర్చు చేస్తే అనేక పరికరాలు వస్తాయి. అయితే వాటిని కూడా కొనుగోలు చేయలేదు. గత డిసెంబర్‌లో హెచ్‌డీఎస్ కమిటీ తొలి సమావేశం జరిగింది. ఇందులో కలెక్టర్ ఆరోగ్యశ్రీ ద్వారా జమకూడిన నిధులలో రూ.2 కోట్లతో ఆస్పత్రికి కావాల్సిన పరికరాలను కొనుగోలు చేసుకోవాలని పర్మిషన్ ఇచ్చారు. అయితే నేటికీ అవసరమైన పరికరాలు కొనలేదు.

లిఫ్ట్‌లు పనిచేయవు.. సకాలంలో స్కానింగ్ చేయరు

పెద్దాస్పత్రిలో రోగుల కోసం 11 లిఫ్ట్‌లను ఏర్పాటు చేశారు. అవి ఒకరోజు పనిచేస్తే రెండు రోజులు పని చేయవు. మరమ్మతులకు గురయ్యే ఉంటాయి. దీంతో రోగులు నాలుగు అంతస్తులు ఎక్కలేక అల్లాడిపోతుంటారు. కాగా రక్తపరీక్షలు చేసే చోట ఆటో ఎనలైజర్ మెషీన్లకు ఏసీలు అవసరం. కానీ అవి పనిచేయడం లేదు. రక్తపరీక్షల రూమ్ వద్ద బయట కనీసం తాగేందుకు నీరు కూడా ఉంచడం లేదు. అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేయాలంటే రెండు రోజుల తర్వాత రావాలంటూ అపాయింట్ మెంట్ ఇస్తున్నారు. అదేమంటే డాక్టరమ్మ ఒక్కరే ఉంటున్నారు. రోగులు ఎక్కువయ్యారు అని సిబ్బంది చెబుతున్నారు. ఈలోపు రోగులు నానా నరకయాతన పడాల్సిందే.

మందుల కొరత

మందులు కొన్ని ఉంటే మరికొన్ని ఉండటం లేదు. ఉదాహరణకు గాబాపెంటిన్ మాత్రను డాక్టర్లు రాసిస్తే దానికి బదులుగా మందుల షాపులో ప్రిగాబాలిన్ ఇస్తున్నారు. పాంటప్రజోల్ మాత్ర రాస్తే ర్యానిటిడిన్ ఇస్తున్నారు. అదేంటని అడిగితే ఇవి కూడా డాక్టర్ రాసిన జబ్బుకు పనిచేస్తాయని చెబుతున్నారు. ఇటీవల కాలంలో లిక్విడ్ పారా ఫిన్ మందు అయిపోయింది. ఇలాంటి అనేక రకాల మందులు ఉండటం లేదు.

కార్పొరేట్ సేవలో వైద్యులు

పెద్దాస్పత్రిలో కొంతమంది డాక్టర్లు నిజాయితీగా పనిచేస్తున్నారు. మరికొంత మంది సీనియర్ డాక్టర్లు విధులకు డుమ్మా కొట్టి ప్రైవేటు, కార్పొరేట్ సేవల్లో తరిస్తున్నారు. పెద్దాస్పత్రిలో థంబ్ వేసి అనంతరం మెడికవర్, అపోలో, నారాయణ తదితర ఆస్పత్రిలో పని చేస్తున్నారు. అడిగే వారు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా మారింది.

కమీషన్లు వచ్చే పనులకేనా బిల్లులు

పెద్దాస్పత్రిలో దివ్యాంగుల కోసం సదరమ్ క్యాంపులో కొన్ని నెలల మందు రూ.6,500 ఖర్చు చేసి షామియానాలు ఏర్పాటు చేసిన వ్యక్తికి ఇంకా నగదు ఇవ్వలేదు. చిన్న, చిన్న బిల్లులకు తిప్పుకుంటున్నారు. సూపరింటెండెంట్‌కు అద్దె కారు పెట్టిన వ్యక్తి ఎనిమిది నెలలు క్రితం తన కారును గిట్టుబాటు కాక ఆపేశాడు. అయినా నేటి వరకు బిల్లులు ఇవ్వలేదు. ఇలా చిన్న ఖర్చులకు కూడా బిల్లులు ఇవ్వడం లేదని హెచ్‌డీఎస్ కమిటీ సభ్యులే తమ జేబులో నుంచి ఖర్చు చేశారు. పలువురు డాక్టర్లు ఆస్పత్రి అవసరాల కోసం అత్యవసరంగా రూ.5 వేలు, రూ.10 వేల కోసం ఖర్చు చేశారు. వాటికి సంబంధించిన డబ్బులు కూడా ఇంకా ఇవ్వలేదు. అడిగితే హెచ్‌డీఎస్‌లో ఫండ్ లేదంటున్నారు. పరిశీలిస్తే రూ.26 లక్షల వరకు హెచ్‌డీఎస్ నుంచి ఖర్చు చేశారని తెలుస్తోంది. కమీషన్లు వచ్చే వాటికోసమే ఈ నగదు చెల్లింపులు జరిగాయనే ఆరోపణలు వస్తున్నాయి. ఒక్కో దఫా సకాలంలో ఇండెంట్ పెట్టకపోవడంతో సెలైన్ పెట్టే పైపులు కూడా రోగులే కొన్నారు. ఇలాంటివి అనేకం ఉన్నాయి. పర్యవేక్షణ లేకపోవడంతో రోగులకు సకాలంలో సేవలందడం లేదు.


తరచూ మరమ్మతులకు గురవుతున్న లిఫ్ట్


వైద్యం కోసం వచ్చిన రోగులు

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం

పెద్దాస్పత్రిలో మంచి వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. అయితే కొన్నిరకాల సమస్యలున్నాయి. వాటిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తాం.
– మదపర్తి శ్రీనివాసులు, హెచ్‌డీఎస్ కమిటీ కో–ఆర్డినేటర్

క్లుప్తంగా

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు



నెల్లూరు (టౌన్) : ధరిత్రీ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎస్సార్కే విశ్వసాయి స్కూల్‌లో విద్యార్థులకు బాలభవన్ ఆధ్వర్యంలో సోమవారం డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం పర్యావరణంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు (లీగల్) : జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌ను నెల్లూరు కేంద్ర కారాగారం పర్యవేక్షణాధికారి వెంకటేశ్వరరావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కోర్టులోని ఆయన చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

పోషకాహారంపై అవగాహన



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని 54వ డివిజన్ జనార్దన్‌రెడ్డికాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీదేవి, క్షేత్ర సహాయకుడు హరికృష్ణ మాట్లాడుతూ పోషకాహారంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు.

ఆత్మీయ వీడ్కోలు


సూర్యతేజకు వీడ్కోలు పలుకుతున్న కలెక్టర్, ఎస్పీ, జేసీ

నెల్లూరు(బారకాసు) : ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ వెళ్తున్న కమిషనర్ సూర్యతేజకు సోమవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో సోమవారం రాత్రి వీడ్కోలు సభను ఏర్పాటు చేసి సత్కరించారు. ముందుగా వేద పురోహితులు సూర్యతేజను ఆశీర్వదించారు. కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, జేసీ కార్తీక్, ఇన్‌చార్జి కమిషనర్ నందన్‌తో పాటు పలువురు సూర్యతేజ దంపతులను పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సూర్యతేజ సతీమణి అమూల్య, ఎన్ఎంసీలోని అన్ని విభాగాల అధికారులు, సచివాలయాల కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేగంగా పొదలకూరు రోడ్డు పనులు


సీసీ డ్రెయిన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

నెల్లూరు సిటీ : పొదలకూరు ప్రధాన రోడ్డు పనులను మూడు నెలల్లో పూర్తి చేస్తామని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. 32వ డివిజన్ సంజయ్ గాంధీనగర్ సెంటర్‌లో రూ.36 లక్షల వ్యయంతో సీసీ డ్రెయిన్ పనులకు ఎమ్మెల్యే సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ పొదలకూరు రోడ్డు మెయిన్ రోడ్డులో సీసీ డ్రెయిన్లకు మరో రూ.90 లక్షల నిధులను కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు.

వృద్ధుడి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్) : వృద్ధుడు అదృశ్యమైన ఘటనపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. తిరిసిపేటలో సురేష్ కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆరోగ్యం కుదుట పడకపోవడంతో కుటుంబసభ్యులకు భారం కాకూడదని భావించిన ఆయన ఈనెల 20న ఇంటి నుంచి ఎటో వెళ్లిపోయారు. బాధిత కుటుంబ సభ్యులు ఆయన కోసం గాలించారు. జాడ తెలియకపోవడంతో సోమవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చిత్రకళలపై 24 నుంచి శిక్షణ

నెల్లూరు(బృందావనం) : ఈనెల 24వ తేదీ నుంచి టెక్కేమిట్టలో ఉన్న అమీర్ ఆర్ట్స్ అకాడమీలో చిత్రలేఖనం, ఫ్రీహ్యాండ్ డ్రాయింగ్, పెయింటింగ్‌లో వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు చిత్రకారుడు అమీర్‌జాన్ సోమవారం తెలిపారు. మే 16వ తేదీ వరకు వరకు 20 రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తిగల వారు 94408 24913, 88858 06660 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని ఎంజీ నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఈఈ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీనరసింహాపురం, పొదలకూరు రోడ్డు, రామాలయంవీధి, నెల్లూరు రూరల్ తహసీల్దార్ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయన్నారు.

స్పోర్ట్స్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో పాటియాల లక్ష్మీబాయి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో డిపార్ట్‌మెంట్ స్పోర్ట్స్, కోచింగ్ కోర్సుల్లో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆర్కే యతిరాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీఎస్‌సీ స్పోర్ట్స్ కోచింగ్, పీజీ డిప్లొమా ఇన్ స్ట్రెస్ అండ్ కండీషనింగ్, పీజీ డిప్లొమా ఇన్ స్పోర్ట్స్ పెర్ఫార్మెన్స్ అనాలసిస్, పీజీ డిప్లొమా ఇన్ స్పోర్ట్స్ సైకాలజీ, పీజీ డిప్లొమా ఇన్ స్పోర్ట్స్ న్యూట్రిషన్, పీజీ డిప్లొమా ఇన్ ఎక్సర్‌సైజ్ ఫిజియాలజీ కోర్సులు చేసేందుకు ఆసక్తిగల వారు https://ssc.nsnis.in/ వెబ్‌సైట్‌లో పొందు పరిచిన మార్గదర్శకాలకు అనుగుణంగా వచ్చే నెల 2వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు జిల్లా క్రీడా ప్రాధికార కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి చర్యలు


ఈసీ మెంబర్లతో సమావేశం

నెల్లూరు (టౌన్) : ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు శ్రీనాథ్ తెలిపారు. స్థానిక వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాలలో మౌలిక వసతులపై ఈసీ మెంబర్ల సమావేశం సోమవారం నిర్వహించారు. పూర్వ విద్యార్థులను ఏకం చేసి కళాశాలలో అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ప్రిన్సిపల్ రామారావు, ట్రెజరర్ శివకుమార్, పూర్వ విద్యార్థులు జనార్దన్, గౌస్‌బాషా పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం

- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి


మాట్లాడుతున్న పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : పార్టీకి కష్టకాలంలో సేవలందించిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. నగరంలోని ఐదో డివిజన్ సత్యనారాయణపురంలో 200 మంది పార్టీ కార్యకర్తల సమావేశానికి ఆయన సోమవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్ పరిధిలో నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా పనిచేసి పార్టీని బలోపేతం చేయాలన్నారు. మంచి చేసే జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయలేకపోయామని ప్రతిఒక్కరూ బాధపడుతున్నారని వివరించారు. స్థానిక ప్రజలతో చర్చించి ఐదో డివిజన్ ఇన్‌చార్జిగా సుబ్బారెడ్డిని, కో–ఆర్డినేటర్‌గా ఇబ్రహింను ఎంపిక చేశామన్నారు. వీరికి సహకరిస్తూ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ అధికారంలోకి తెచ్చే దిశగా కృషి చేయాలన్నారు.

వంద బారికేడ్ల వితరణ


బారికేడ్లను ప్రారంభిస్తున్న ఎస్పీ

నెల్లూరు(క్రైమ్) : మెడికవర్ హాస్పిటల్ యాజమాన్యం చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎస్పీ జి.కృష్ణకాంత్ అన్నారు. మెడికవర్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ అనిల్ కృష్ణారెడ్డి సూచనలతో నెల్లూరు సెంటర్ హెడ్ డాక్టర్ ధీరజ్‌రెడ్డి పోలీసు కవాతు మైదానంలో రూ.7 లక్షల విలువ చేసే వంద మూవబుల్ బారికేడ్లను ఎస్పీ కృష్ణకాంత్‌కు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు మూవబుల్ బారికేడ్లను అందజేసిన ఆస్పత్రి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, నగర డీఎస్పీ పి.సింధుప్రియ, ట్రాఫిక్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్‌లు వెంకటరెడ్డి, రామకృష్ణ, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, మెడికవర్ మార్కెటింగ్ మేనేజర్ సతీష్, భద్రత కోఆర్డినేటర్ అనిల్, పీఆర్వో చందువర్మ తదితరులు పాల్గొన్నారు.

పునరావాసం కల్పించాలి


మాట్లాడుతున్న సీపీఎం కార్యదర్శి కొండా ప్రసాద్

నెల్లూరు(అర్బన్) : రోడ్ల విస్తరణ పేరుతో తొలగించిన అయ్యప్పగుడి ఉడ్‌కాంప్లెక్స్ దళితులకు పునరావాసం కల్పించాలని సీపీఎం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పలువురు బాధితులతో కలిసి కలెక్టరేట్ వద్ద ఆయన సోమవారం నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ ఆనంద్‌కు అర్జీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఉడ్‌కాంప్లెక్స్‌లోని కొయ్య మిల్లులను ఆధారం చేసుకుని 25 దళిత కుటుంబాలు పార్కు ముందు భాగంలో 30 ఏళ్లుగా నివాసం ఉంటున్నారని తెలిపారు. అయితే కొంతమంది అభివృద్ధి పేరిట వారి గుడిసెలను తొలగించడం అన్యాయమన్నారు. కనీస సమయం కూడా ఇవ్వలేదని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునేంత సమయం కూడా ఇవ్వలేదన్నారు. దీనిపై కలెక్టర్ స్పందించిన న్యాయం చేయాలని కోరారు. లేకుంటే ఆందోళనలు చేస్తామని స్పష్టం చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కె.పెంచలనరసయ్య, కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, సింహగిరి పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి విగ్రహ ఏర్పాటుకు నగరంలో స్థలాన్ని కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ నగరాధ్యక్ష, ఉపాధ్యక్షులు కిరణ్‌కుమార్‌రెడ్డి, సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. నగరంలోని కాంగ్రెస్ పార్టీ సిటీ కార్యాలయంలో వారు సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా పనిచేసిన నేదురుమల్లి అనేక మంది విద్యార్థులకు ఉన్నత విద్య అందించేలా చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు.

విచారణ జరపాలని వినతి



నెల్లూరు(క్రైమ్) : హౌసింగ్ నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలని బీజేపీ నాయకులు ఏసీబీ డీఎస్పీ బి.శిరీషకు తన కార్యాలయంలో సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నేత మిడతల రమేష్ మాట్లాడుతూ హౌసింగ్‌లో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని, విజిలెన్స్ అధికారులు నివేదిక ఇచ్చినా ఇంతవరకు సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోలేదన్నారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కందికట్టు రాజేశ్వరి, పొట్లూరు శ్రీనివాసులు, యాకసిరి ఫణిరాజు, రఘురామయ్య, పద్మావతి పాల్గొన్నారు.

షుగర్ ఫ్యాక్టరీపై 24న సదస్సు

కోవూరు : షుగర్ ఫ్యాక్టరీ భవిష్యత్ కార్యాచరణపై 24వ తేదీన జిల్లా స్థాయి సదస్సు జరుగుతుందని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రఘురామయ్య అన్నారు. కోవూరులోని సీపీఎం కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 ఎన్నికల్లో చంద్రబాబు అధికారంలోకి రాగానే ఫ్యాక్టరీని తెరిపిస్తానని హామీ ఇచ్చారన్నారు. అయితే హామీని అమలు చేయకపోగా ఫ్యాక్టరీని ఏపీఐఐసీకి అప్పగించి ఉద్యోగావకాశాలు కల్పిస్తానని ప్రకటన చేశారన్నారు. దీనిపై భవిష్యత్ కార్యాచరణ కోసం 24వ తేదీ షుగర్ ఫ్యాక్టరీ ఆవరణలో జరిగే సదస్సులో షేర్‌దారులు, రైతులు పాల్గొనాలని కోరారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

విడవలూరు : మండలంలోని ఊటుకూరు పంచాయతీ గొళ్లపాళెనికి చెందిన సూరిశెట్టి నాగార్జున(33) అనే వ్యక్తి స్థానిక బీజేపీ కార్యాలయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం మేరకు.. ఊటుకూరు గ్రామానికి చెందిన నాగార్జున ఊటుకురులోనే ఆటో మెకానిక్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ప్రతిరోజూ రాత్రి వేళల్లో స్థానిక బీజేపీ కార్యాలయంలో నిద్రపోయేవాడు. ఆదివారం రాత్రి కూడా బీజేపీ కార్యాలయంలో పడకోగా, సోమవారం ఉదయం గ్రామస్తులకు ఉరేసుకుని విగతజీవిగా కనిపించాడు. వెంటనే వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు అక్కడికి చేరుకుని స్థానికుల సహాయంతో మృతదేహాన్ని ఇంటికి తరలించి అంత్యక్రియలు పూర్తి చేశారు. అయితే ఈ ఘటనపై పోలీసులకు సమాచారం లేదు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు


అర్జీని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు) : నగరంలో స్థానిక సమస్యల సత్వర పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఇన్‌చార్జి కమిషనర్ వైఓ నందన్ స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ సచివాలయ కార్యదర్శులు తమ పరిధిలో సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల ఆక్రమణ తదితర సమస్యలపై ఎన్ఎంసీ కార్యాలయానికి వస్తున్నారని, వాటిని స్థానికంగానే పరిష్కరించాలని తెలిపారు. కాగా ప్రజల నుంచి 55 ఫిర్యాదులు అందాయని, ఇందులో ఇంజినీరింగ్ విభాగానికి 7, హౌసింగ్ 17, పట్టణ ప్రణాళిక 12, రెవెన్యూ 8, పబ్లిక్ హెల్త్ 3, ఆప్కాస్ 6, అకౌంట్ 2 చొప్పున ఉన్నాయని చెప్పారు. ఈ ఫిర్యాదులను నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎంహెచ్ఓ డాక్టర్ చైతన్య, ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ పద్మజ, సెక్రటరీ శ్రీలక్ష్మి, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నిర్దేశిత సమయంలోనే చెత్త సేకరణ

నగరంలో ఇంటింటి చెత్త సేకరణ ప్రతిరోజు నిర్దేశిత సమయంలోనే చేయాలని ఇన్‌చార్జి కమిషనర్ నందన్ ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా ఆయన స్థానిక 53, 54వ డివిజన్ల పరిధిలోని రైల్వేవీధి, భగత్‌సింగ్‌కాలనీ, ఇస్లామ్‌పేట, ఆలీవీధి, జనార్దన్‌రెడ్డి కాలనీ, వెంకటేశ్వరపురం తదితర ప్రాంతాల్లో సోమవారం పర్యటించారు. కార్మికులు, కార్యదర్శుల హాజరును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు అవగాహన కలిగించి ఒకే సమయంలో చెత్త సేకరణ చేపట్టాలన్నారు. బస్టాండ్, రైల్వేస్టేషన్, మార్కెట్ తదితర రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ఉండాలని, ప్రధాన రహదారులు ఉదయం 7 గంటలకల్లా శుభ్రం చేయాలన్నారు. అనంతరం తడికల బజార్ కూడలిలోని అన్న క్యాంటీన్‌ను సందర్శించి ఆహార నాణ్యతను పరిశీలించారు.

నెల్లూరు రూరల్లో కార్డన్ సెర్చ్


ప్రజలతో మాట్లాడుతున్న పోలీసులు

- నాలుగు వాహనాల స్వాధీనం

నెల్లూరు సిటీ: ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాలతో నెల్లూరు రూరల్ పోలీసులు దొరతోపుకాలనీలో డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. నలుగురు సీఐలు, పదిమంది ఎస్సైలు, 62 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. మొత్తం 400 ఇళ్లల్లో తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాల్లేని నాలుగు మోటార్‌బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అసాంఘిక శక్తుల ఏరివేతే లక్ష్యంగా సెర్చ్ చేపట్టినట్లు తెలిపారు.

వాటర్ ప్లాంట్‌ను వినియోగంలోకి తేవాలి


మాట్లాడుతున్న కృష్ణమూర్తి

నెల్లూరు(అర్బన్) : స్థానిక బుజబుజనెల్లూరులో ప్రభుత్వ మెగా మినరల్ వాటర్ ప్లాంట్‌ను పునః ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్‌కు సోమవారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ పార్టీ కార్యదర్శి కృష్ణమూర్తి మాట్లాడుతూ 2012లో రూ.2 కోట్లకు పైగా నిధులతో మినరల్ ప్లాంట్‌ను బుజబుజనెల్లూరులో ఏర్పాటు చేశారన్నారు. కొన్నేళ్ల పాటు కేంద్ర ప్రభుత్వం నియమించిన కాంట్రాక్టు సంస్థ ప్లాంటును నిర్వహించడం వల్ల ఎలాంటి ఇబ్బందులు లేకుండా సుమారు 25 వేల ప్రజలు మినరల్ వాటర్‌ను పొందారన్నారు. ఆరేళ్ల క్రితం నెల్లూరు నగరపాలక సంస్థకు వాటర్ ప్లాంటును అప్పగించారన్నారు. అప్పటి నుంచి ప్రాజెక్టు నిర్వహణ అస్తవ్యస్తంగా మారి ప్లాంటును మూసేశారన్నారు. ప్రస్తుతం దీనిని వినియోగంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, సింహగిరి, పెంచలనరసయ్య పాల్గొన్నారు.